ఆకాశవాణి హైదరాబాద్ విభాగం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ:19.07.2025 సమయం : 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రవాణా రంగానికి చోధక శక్తిగా , ఆర్ధిక ప్రగతికి ఉపకరిస్తుందని, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

2. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులను పెంచటానికి, ప్రభుత్వ పథకాల అమలు తీరుకు సంబంధించి, ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

3. రాష్ట్రవ్యాప్తంగా కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను త్వరితగతిన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని , రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

4. నైరుతి రుతు పవనాల ప్రభావంతో తెలంగాణలో రాగల 48 గంటల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**కాజీపేట రైల్వే కోచ్**

కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాల కోరిక అని.. దానిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెరవేర్చారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ , రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం

నిర్మిస్తోందని.. నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. 2026 సంవత్సరంలో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని , అలాగే ఇక్కడి నుంచి 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి అవుతాయన్నారు. ఈ కోచ్ ఫ్యాక్టరీలో మెట్రో రైలు కోచ్‌లు కూడా తయారవుతాయని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 40 ఏళ్ల పోరాటానికి ఫలితంగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మనకు లభించిందని కేంద్ర బొగ్గుశాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో ఇప్పటికే విమానాశ్రయ నిర్మాణం పూర్తి కావాల్సి ఉందని, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూమిని ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని అడిగామని , భూసేకరణ గురించి ఈ ప్రభుత్వాన్ని కూడా అడుగుతున్నామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

**బైట్స్ అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి............**

పిటిసి, డెస్క్

**ప్రత్యేక రైలు:**

రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్, కేంద్ర బొగ్గు గనులు శాఖ మంత్రి కిషన్ రెడ్డి కాచీగూడా రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు. మరికొద్ది సేపటిలో జోద్ పూర్ కు నేరుగా ఎక్స్ ప్రెస్ రైలును మారి కొద్ది సేపటిలో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ , మహారాష్ట్ర మధ్యప్రదేశ్ మీదుగా రాజస్థాన్ లోని జోద్ పూర్ కు వెళ్ళె రైలు ప్రయాణీకులకు ఎంతో సదుపాయంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ... తెలంగాణకు రైల్వే నెట్ వర్క్ లో దీర్ఘకా లికంగా పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయటంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారిస్తోందని అన్నారు.

MSL

**రక్త పరీక్షలు**

రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలోని బాలబాలికలకు , ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లలలో శారీరకంగా ఎదుగుదల లేకపోవడం వల్ల రక్తహీనత పెరుగుతుండటం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైద్యశాఖ అధికారులు తెలియజేశారు. రక్త పరీక్షల అనంతరం వారికి అవసరమైన ఆహారాన్ని అందించి , వారి ఆరోగ్యంపై ప్రతినెల గ్రోత్ ప్రోగ్రెస్ రిపోర్టు రూపొందిస్తామని పేర్కొన్నారు.

డెస్క్

**సబ్ కమిటీ**

రాష్ట్ర క్యాబినెట్ సబ్ కమిటీ ఈరోజు సమావేశం అయింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర ఆదాయం పెంపుపై సబ్ కమిటీ చర్చించింది. అలాగే ఆదాయవనరుల విశ్లేషణ ,పన్నుల రేట్లు ,ప్రభుత్వ పథకాల అమలు , ప్రభుత్వ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయం వంటి అంశాలపై ఈ సమావేశంలోప్రత్యేకంగా దృష్టి సారించారు.

డెస్క్

**భద్రాద్రి కొత్తగూడెం**

ప్రజల ఆరోగ్యం, విద్య, గ్రామీణ రహదారులు, తాగునీటి సమస్యలు, రేషన్ కార్డుల జారీ, పెన్షన్ జాప్యం, వ్యవసాయ రంగ సవాళ్లు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి కీలక అంశాల విషయంలో భద్రాది కొత్తగూడెం జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పలు సూచనలు చేశారు. ఈరోజు ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం ద్వారా 'అభివృద్ధి పథంలో భద్రాద్రి కొత్తగూడెం' అనే ఫోన్ ఇన్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. యువత ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా ఉన్న భూములను సద్వినియోగం చేసుకుంటూ ఆయిల్ ఫామ్, మునగ సాగు, చేపల పెంపకం వంటి ఆధునిక వ్యవసాయ పద్దతుల ద్వారా

ఆర్థికంగా ఎదగాలి అని సూచించారు. వ్యవసాయంలో నూతన పద్ధతులను రైతులు అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. కలెక్టర్ ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రోగ్రామ్ హెడ్ కొలిపాక శంకర్రావు సంధానకర్తగా వ్యవహరించారు.

BYTE ... SHANKAR RAO

పిటిసి, భద్రాది కొత్తగూడెం

**బోనాలు :**

హైదరాబాద్ నగరంలో బోనాలు వేడుక సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ తెలియజేశారు. ఈనెల 20, 21 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. మహంకాళి లాల్ దర్వాజా ఆలయంలో ఈనెల 21న బోనాల సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆలయ పరిసరాల్లో వాహనాల రాకపోకలకు అనుమతి లేదని తెలిపారు.

డెస్క్

**లబ్ధిదారు :**

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద తమకు ఉచిత రేషన్ బియ్యం అందుతోందని , కేంద్ర ప్రభుత్వ పథకాలు పేద , మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని , రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు లక్కం తిరుపతి ఆకాశవాణి తో మాట్లాడుతూ........

**బైట్ ...............**

పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా

**హైపేస్**

జనగామ -సూర్యాపేట 365 జాతీయ రహదారి ప్రస్తుత రెండు లైన్లను నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంగా రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 83 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ జరగనున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రాల పరిధిలో ఉన్న జాతీయ రహదారుల విస్తరణకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు వేగవంతంగా మంజూరు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ రహదారుల అభివృద్ధికి అవసరమైన భూసేకరణ అటవీ అనుమతులతో పాటు పర్యావరణ అనుమతులు కూడా రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని సమగ్రంగా ఉన్నాయని కేంద్రం భావిస్తే రోడ్డు విస్తరణ పనుల ఖర్చులు మొత్తం కేంద్రమే భరిస్తుంది. జాతీయస్థాయిలో 15 రోడ్ల విస్తరణకు అనుమతులు ఇవ్వగా ఇందులో జనగామ -సూర్యాపేట 365 జాతీయ రహదారి పనులకు కేంద్రం అనుమతిని ఇచ్చింది. ప్రస్తుతం గుర్తించిన పనులను 2028 కల్లా పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

పిటిసి, జనగామ జిల్లా

**హైడ్రా**

హైడ్రాకు ప్రజలు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన హైడ్రా ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్కులు , నాలాలు, చెరువుల ఆక్రమణలను హైడ్రా అడ్డుకుంటుందన్నారు.     ,ప్రభుత్వ ఆస్తులను దురాక్రమణ చేసే స్వార్థపరులను నిలువరించి ప్రజలకు అన్ని విధాల సేవ చేయడమే హైడ్రా కర్తవ్యం అని రంగనాథ్ స్పష్టం చేశారు.

డెస్క్

**పొన్నం ప్రభాకర్**

రాష్ట్రవ్యాప్తంగా కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని , రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ రోజు 25 మంది లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. అలాగే హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలలో ఎక్కడైనా ఇబ్బందుల ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్ , జిల్లా కలెక్టర్ , హైడ్రా కమిషనర్ , పోలీస్ కమిషనర్ , వాటర్ వర్క్ , ఇతర అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

డెస్క్

**ఆర్థిక సంఘం**

పరిపాలనలో ప్రజలను భాగస్వాములను చేస్తూ వారి సామాజిక , ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ రోజు నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు ఎం.రమేష్, సంకెపల్లి సుధీర్ రెడ్డిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా నిజామాబాద్ , కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు టి.వినయ్ కృష్ణారెడ్డి , ఆశిష్ సంగ్వాన్‌లు ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల పనితీరును చైర్మన్‌కు వివరించారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుద్ధ్య నిర్వహణ కొనసాగేలా స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని రాజయ్య అన్నారు.

PTC - కామారెడ్డి

**వాతావరణం :**

నైరుతి రుతు పవనాల ప్రభావంతో తెలంగాణలో రాగల 48 గంటల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో ఐదురోజులపాటు మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఈ రోజు తెలంగాణలోని వికారాబాద్ , రంగారెడ్డి, ములుగు, భద్రాద్రి, జయశంకర్, జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు.

డెస్క్

**రేషన్ కార్డులు**

పేద ప్రజల అభివృద్ధి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని , అందులో భాగంగా అర్హులైన వారికి కొత్తగా రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం , , చందుర్తి, రుద్రంగి, మండల కేంద్రాలలో లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి కొత్త రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుతో పాటు ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందని అన్నారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**సూర్యాపేట జిల్లా**

పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే కళాశాల స్థాయిలోనే విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ... విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివి, మెరుగైన భవిష్యత్తును అందుకోవాలని ఆకాంక్షించారు.

పీటీసీ నల్లగొండ జిల్లా

**యాదగిరిగుట్ట దేవస్థానం**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన అభివృద్ధికి సంబంధించి పలు కార్యక్రమాలు చేపట్టినట్లు కార్యనిర్వహణాదికారి వెంకట్రావు పేర్కొన్నారు. నృసింహ స్వామి వైభవాన్ని వివరించేందుకు, ఆలయానికి సంబంధించిన సమాచారం అందించేందుకు దేవస్థానం త్వరలో మాసపత్రికను ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే , స్వామివారి సేవా కార్యక్రమాలను భక్తులకు చేరవేయడంలో భాగంగా దేవస్థానం యూట్యూబ్ ఛానల్ ప్రారంభించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కొండ చుట్టూ నిర్మాణంలో ఉన్న వలయ రహదారిపై దైవ స్వరూపాలకు సంబంధించిన విగ్రహాల ఏర్పాటుకు దాతలు ఆర్థికంగా సహకరించాలని ఆలయ ఈవో కోరారు.

పీ టీ సీ యాదాద్రి భువనగిరి